సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



సం'పత్తి' పతనం..

పత్తి ధరలు నానాటికీ పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు. 8లో



సంక్షేమంతో పాటు శిక్షణ

జర్నలిస్టుల సంక్షేమంతో పాటు శిక్షణపై దృష్టి సారించినట్లు మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 18°

వాతావరణం

జిల్లాలో ఆదివారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. తెల్లవారుజామున మంచు, రాత్రి వేళ చలి ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

రామాలయంలో సుదర్శన యాగం



సుదర్శన యాగం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన యాగశాలలో శనివారం చిత్తా నక్షత్రాన్ని పురస్కరించుకుని సుదర్శన యాగం, ప్రత్యేక పూజలు చేశారు. అంతరాలయంలో స్వామివారికి స్వర్ణ తులసీ అర్చన, ఆర్జిత సేవలు జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. ఆ తర్వాత స్వామి, అమ్మవార్లను బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి కంకణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం శనివారం వైభవంగా జరిగింది. శ్రీ స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు వేద మంత్రాల నడుమ స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహాశివరాత్రికి రండి..



మంత్రికి ఆహ్వానపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ఈనెల 17 నుంచి 19 వరకు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు రావాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను ఆలయ ధర్మకర్త మారగాని శ్రీనివాసరావు ఆహ్వానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.

ఎనిమిది మంది ఎస్సైల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో ఎనిమిది మంది ఎస్సైలను బదిలీ చేస్తూ ఐజీపీ ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్సై ఎస్‌డీ షాహినాను అన్నపురెడ్డిపల్లికి, ఏడూళ్ల బయ్యారం ఎస్సై పీవీఆర్ సూరిని చర్ల ఎగ్జిస్టింగ్ స్థానానికి, అశ్వాపురం ఎస్సై పఠాన్ నాగుల్ మీరాను ఏడూళ్ల బయ్యారం, ములకలపల్లి ఎస్సై బి.సురేష్‌ను అశ్వాపురానికి, దమ్మపేట స్టేషన్ ఎటాచ్‌లో ఉన్న బి.సాయి కిశోర్‌రెడ్డిని ములకలపల్లికి బదిలీ చేశారు. అన్నపురెడ్డిపల్లి ఎస్సై జి.విజయను కొత్తగూడెం వన్‌టౌన్‌కు, బూర్గంపాడు ఎస్సై జి.రమణారెడ్డికి టేకులపల్లికి, అక్కడి ఎస్సై బి.శ్రీనును బూర్గంపాడుకు బదిలీ చేశారు.

నేడు 'అరుణ్‌సాగర్' అవార్డుల ప్రదానం

భద్రాచలంఅర్బన్: ప్రముఖ కవి, జర్నలిస్ట్ అరుణ్‌సాగర్ పేరిట ఇచ్చే పురస్కారాలను ఈ సంవత్సరానికి ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, కవయిత్రి కుప్పిలి పద్మకు అందించనున్నట్టు అరుణ్‌సాగర్ ట్రస్ట్ బాధ్యులు తెలిపారు. భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో ఆదివారం అవార్డుల ప్రదానం ఉంటుందని, అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సభకు అతిథులుగా 'సాక్షి' ఎడిటర్ వి.మురళి, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి హాజరవుతారని వివరించారు.

నమ్మి గెలిపిస్తే హరీమనిపించారు..

అన్నింటా కమీషన్ కావాలంటున్నారు

- బయ్యారం ఉక్కు రాదు, సీతారామ పోయింది
- సీఎం కేసీఆర్ వల్లే సింగరేణిలో సమస్యలు
- అధికారంలోకి వస్తే రెవెన్యూ డివిజన్‌గా ఇల్లెందు
- హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఇల్లెందు: కాంగ్రెస్ కార్యకర్తలు శ్రమకోర్చి గెలిపిస్తే వారి కష్టాన్ని దొర దొడ్లో తాకట్టు పెట్టారంటూ ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియను ఉద్దేశించి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇల్లెందులోని జగదాంబ సెంటర్‌లో శనివారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా రాష్ట్రంలోని పలు అంశాలపై విమర్శలు ఎక్కుపెట్టిన రేవంత్.. ఆ తర్వాత ఇల్లెందు అంశాలను ప్రస్తావించారు. 'ఏందిరా హరీ అంటే.. నీది తింటా.. నాదీ తింటా అంటున్నాడు. ఇసుక, ఇటుక, ప్రభుత్వ భూములు అన్నింటినీ 'హరీ'మనిపిస్తున్నాడు. పనులు కాకున్నా 30 శాతం కమీషన్లు కావాలంటున్నాడు అంటూ ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త, ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ హరిసింగ్‌లను లక్ష్యంగా చేసుకుని పరోక్ష విమర్శలు చేశారు. విభజన చట్టంలో పేర్కొన్న బయ్యారం ఉక్కు కర్మాగారం సాధించడంలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని, సీతారామ ప్రాజెక్టు ఇల్లెందుకు క్యాన్సిల్ అయిందని అన్నారు.

ఒకప్పుడు ఎనిమిది వేల మంది..

ఇల్లెందు ఏరియాలో ఒకప్పుడు ఎనిమిది వేల మంది కార్మికులు పని చేసేవారని, ఇప్పుడా సంఖ్య రెండు వేల లోపునకే పరిమితమైందని రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త బావులు తెరవడంలో నిర్లక్ష్యం కారణంగానే ఇక్కడ ఉద్యోగుల సంఖ్య తగ్గుతోందన్నారు. ఉద్యమ సమయంలో ఓపెన్ కాస్ట్ మైన్లు ఉండవని చెప్పిన కేసీఆర్.. ఆ తర్వాత ఆ ఊసే మరిచారని విమర్శించారు. సింగరేణిలో పేరుకుపోయిన సమస్యలకు సీఎం కేసీఆరే కారణమన్నారు. మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న 50 ఎకరాల గిరిజనుల భూమిని సింగరేణి సంస్థ అన్యాయంగా స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. మేడారం నుంచి ఇల్లెందు వరకు అన్ని చోట్లా పోడు సమస్య తీవ్రంగా ఉందన్నారు.

రెవెన్యూ డివిజన్ చేస్తాం..

వచ్చే ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే ఇల్లెందు ప్రజల కోరిక మేరకు కొత్త మండలాలతో పాటు ఇల్లెందును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సభకు వచ్చిన ప్రజలు చూపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థికి 30 వేల ఓట్లకు తగ్గకుండా మెజార్టీ వస్తుందనే నమ్మకం ఉందన్నారు.

రేవంత్‌ను విమర్శించేవారు అజ్ఞానులే..

అన్ని వర్గాల వారి సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని విమర్శించే వారిని అజ్ఞానులుగానే భావించాల్సి ఉంటుందని కేంద్ర మాజీ మంత్రి బలరామ్ నాయక్ అన్నారు. కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. గిరిజనుల పోడు భూములకు పట్టాలు, పంటలకు గిట్టుబాటు ధరలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రెండు సింగరేణి మైన్ల ఏర్పాటుకు గుండాల ప్రాంతంలో అవకాశం ఉన్నా.. వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నాడని, అందుకే వాటిని ప్రారంభించడం లేదని విమర్శించారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క మాట్లాడుతూ.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పీడిత ప్రజల తరఫున ప్రశ్నించే గొంతుక అయ్యాడని అన్నారు. నాడు పీడిత ప్రజల స్వయం పాలన కోసం పోరాడి దేవతలుగా మారిన సమ్మక్క సారక్కల ఆశీర్వాదం తీసుకుని కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేందుకే హాత్ సే హాత్ జోడో యాత్ర ప్రారంభించారని చెప్పారు. ఈ యాత్రకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని తెలిపారు. పార్టీ మారిన వారు, ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కినవారు సభకు వస్తున్న ప్రజా స్పందన చూసి అక్కసుతో కేసులు పెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు.కేసీఆర్‌ను ఇంటికి తోలే వరకూ పాదయాత్ర సాగుతుందన్నారు. సభలో నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, బెల్లయ్యనాయక్, శంకర్‌నాయక్, రాజేందర్‌రెడ్డి, రాఘవరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, మల్లు రవి, చరణ్‌రెడ్డి, వంశీకృష్ణ, సాయిశంకర్, దళ్‌సింగ్‌నాయక్, రాంచందర్‌నాయక్, జి.రవి, చీమల వెంకటేశ్వర్లు, మంగీలాల్‌నాయక్, గుండెబోయిన నాగమణి, శంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ పెండెకట్ల యాకయ్య, దొడ్డా డానియేల్, పులి సైదులు పాల్గొన్నారు.



ఇల్లెందులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి, సీతక్క



దివ్యాంగుడితో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

రూట్ మారింది..

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకి యాత్ర ప్రవేశించే ముందు ఇల్లెందు నియోజకవర్గం తర్వాత భద్రాచలం, ఆ తర్వాత పినపాక నియోజకవర్గంలో యాత్ర ఉంటుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కానీ అనూహ్యంగా శనివారం మధ్యాహ్నం యాత్ర రూట్‌మ్యాప్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. భద్రాచలానికి బదులు పినపాక నియోజకవర్గానికి యాత్ర దారి మళ్లింది. ఇల్లెందు పర్యటన అనంతరం అశ్వాపురం మండలానికి రేవంత్ యాత్ర చేరుకుంది. ఆదివారం యాత్రకు విరామం ఇచ్చి సోమవారం మణుగూరులో కార్నర్ మీటింగ్ ఉండవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. కాగా అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం ములుగు ఎమ్మెల్యే సీతక్క నేరుగా హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో పాల్గొన్నప్పటికీ.. డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాత్రం శనివారం రాత్రి యాత్రలో ఎక్కడా కనిపించలేదు. దీంతో పార్టీలో అంతర్గత కలహాలు ఏమైనా ఉన్నాయా అనే చర్చకు దారితీసింది.

కల్వకుంట్ల కమీషన్లకు సింగరేణి బలి

ఒకప్పుడు కళకళలాడిన సింగరేణి నేడు విలవిల్లాడుతోందని, కమీషన్ల మాయాజాలం విలయ తాండవం చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీఎం కేసీఆర్ తనకు అనుకూలంగా పనిచేసే అధికారులను నియమించుకుని ఇష్టారాజ్యంగా సింగరేణి సొమ్మును దోచుకుంటున్నారని అన్నారు. సీఎండీగా ఒకరు, ఆ సంఘానికి గౌరవాధ్యక్షులుగా మరొకరు ఉంటూ కార్మికుల కష్టాన్ని కల్వకుంట కుటుంబం పాలయ్యాలే చూస్తున్నారని ఆరోపించారు. ఇల్లెందు జేకే-5 ఓసీలో ఫస్ట్ షిఫ్ట్ కార్మికులతో శనివారం జరిగిన ఫిట్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికుల సకల జనుల సమ్మె కీలకమైందన్నారు. ఆనాడు సింగరేణి కార్మికులను మభ్యపెట్టి ఎన్నో వాగ్దానాలు చేసిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చాక అన్నీ మర్చిపోయాడని, సింగరేణి సంపదను కమీషన్ల పేరుతో దండుకుంటున్నాడని అన్నారు. ఒకనాడు సింగరేణిలో 80 వేల మంది కార్మికులు ఉంటే నేడు 40 వేల మందికి తగ్గిందన్నారు. అనేక క్రిమినల్ కేసుల్లో ఉన్న అధికారిని సీఎండీగా నియమించారని, ఎనిమిదేళ్ల పాటు ఆయన కొనసాగుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం ఈ ఎనిమిదేళ్ల అవినీతి దందాపైనే ఉంటుంద న్నారు. కార్యక్రమంలో పాదయాత్ర పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయరమణారావు, మానవతారాయ్, ఐఎన్‌టీయూసీ నేతలు త్యాగరాజు, లింగాల జగన్నాధం , మహబూబ్, చిన్నా, కన్నయ్య పాల్గొన్నారు.



తట్టా చెమ్మాస్‌తో రేవంత్‌రెడ్డి

రాజీమార్గంలోనే కేసులు పరిష్కరించుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి చంద్రశేఖరప్రసాద్

కొత్తగూడెంటౌన్: కలహాలు వీడి సామరస్యంగా రాజీ మార్గంలో జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ అన్నారు. తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. జిల్లా కోర్టులో శనివారం జరిగిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భార్యాభర్తలు చిన్న చిన్న సమస్యలను అక్కడే పరిష్కరించుకోవాలని, కోర్టు మెట్లు ఎక్కేదాకా రావద్దని సూచించారు. సమస్యల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కక్షిదారులకు మధ్యాహ్నం పులిహోర, భోజన సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి శ్యాంశ్రీ, అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఆడెపు నీరజ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనుబ్రోలు రాంప్రసాదరావు, ఉపాధ్యక్షుడు శరత్, అడిషనల్ పీపీ పీవీడీ లక్ష్మి, లక్కినేని సత్యనారాయణ, రామారావు, డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, పి.నిరంజన్ రావు, జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించిందని, జిల్లా వ్యాప్తంగా 2018 కేసులు పరిష్కారం అయ్యాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కోర్టులో రాజీ మార్గం ద్వారా మోటర్ వాహన ప్రమాద కేసులు, బ్యాంకు పీఎల్‌సీలతో పాటు పలు కేసులు పరిష్కారం అయ్యాయని చెప్పారు. కొత్తగూడేనికి చెందిన 633 కేసులు, ఇల్లెందుకు చెందిన 502, భద్రాచలం 630, మణుగూరుకు చెందిన కేసులు 253 పరిష్కారం అయ్యాయని వివరించారు.

ప్రశాంతంగా టీసీసీ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన లోయర్, హయ్యర్ డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉదయం పరీక్షకు 403 మందికి గాను 173 మంది హాజరు కాగా, 230 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 403 మందికి 171 మంది హాజరు కాగా, 232 మంది గైర్హాజరయ్యారని డీఈఓ ఎన్.ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు.

అశ్వాపురం చేరుకున్న రేవంత్‌రెడ్డి

అశ్వాపురం: హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి శనివారం రాత్రి అశ్వాపురం మండలానికి చేరుకున్నారు. మండల పరిధిలోని గొల్లగూడెంలో ఏర్పాటు చేసిన శిబిరంలో బస చేశారు. ఆదివారం యాత్రకు విరామం ఇచ్చి విశ్రాంతి తీసుకోనున్నారు. సోమవారం అశ్వాపురం మండలం మొండికుంట నుంచి పాదయాత్ర ప్రారంభించి సీతారాంపురం, గొల్లగూడెం, అశ్వాపురం, జగ్గారం, మిట్టగూడెం, కళ్యాణపురం మీదుగా మణుగూరు చేరుకుంటారు. అక్కడ కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారు. మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య, పినపాక నియోజకవర్గ నాయకులు విజయగాంధీ, శ్రీవాణి, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి భిక్షమయ్య తదితరులు రేవంత్‌రెడ్డికి స్వాగతం పలికారు.

భద్రాచలంలో 16న జాబ్‌మేళా

భద్రాచలం: నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యాన ఈనెల 16న భద్రాచలంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమాతో పాటు బీటెక్ పూర్తిచేసి 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగిన నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాకు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ జిరాక్స్‌లతో ఐటీడీఏ ప్రాంగణంలోని యువజన శిక్షణ కేంద్రానికి రావాలని సూచించారు.

భద్రాద్రి గోశాలలో షెడ్ ప్రారంభం

భద్రాచలం: ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామంలోని భద్రాద్రి ఆలయ భూముల్లో నిర్మించిన గోకుల రామమ్‌లోని గోవుల కోసం ఏర్పాటు చేసిన రెండో షెడ్డు అందుబాటులోకి వచ్చింది. ఈ షెడ్‌ను శనివారం కరూర్ వైశ్యా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ బి.రమేశ్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ దేవస్థానం ఆధ్వర్యంలో గోమాతకు ప్రాధాన్యమిస్తూ గోకుల రామమ్‌ను నిర్మించటం అభినందనీమన్నారు. ఈ బృహత్ కార్యంలో తమ బ్యాంక్ భాగస్వామ్యం ఉండటం సంతోషాన్నిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి..

- మూడు పంచాయతీలుగా భద్రాద్రి ప్రకటనపై ఆందోళనలు
- సీపీఎం ఆధ్వర్యాన నిరసన, సీపీఐ సంతకాల సేకరణ

భద్రాచలంఅర్బన్: ప్రజాభిప్రాయం సేకరించకుండా ప్రభుత్వం భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా విభజించడం వల్ల అనేక సమస్యలు, చిక్కులు వచ్చే అవకాశముందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ నిర్ణయం ప్రకటించిన నేపథ్యాన శనివారం పట్టణంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో అనేక ఆందోళనలు చేపట్టి, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా మూడు జీపీలుగా విభజించడం గర్హనీయమన్నారు. ఇకనైనా భద్రాచలం పట్టణాన్ని ఒకే జీపీగా పరిగణించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎం.బీ.నర్సారెడ్డి, గడ్డం స్వామి, రేణుక, బండారు శరత్‌బాబు, వై.వెంకటరామారావు, డి.సీతాలక్ష్మి, బి.కుసుమ, యు.జ్యోతి, జి.జ్యోతి, జి.లక్ష్మణ్, ఎం.నాగరాజు, సీహెచ్.మాధవ్, రామకృష్ణ, కాక రమణ, కనకశ్రీ, నాగలక్ష్మి, రమణ, టి.కుమారి పాల్గొన్నారు.

బిల్లును రద్దు చేయాలి

భద్రాచలం గ్రామపంచాయతీని మూడు జీపీలుగా విభజిస్తూ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లును రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన సంతకాల సేకరణను పార్టీ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. ఇప్పటికే అన్ని రకాలుగా మోసపోయిన, పట్టణాన్ని మళ్లీ మూడు ముక్కలు చేయడం ఏమిటన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాన్ని ముక్కలు చేసే బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బల్ల సాయికుమార్, మారెడ్డి శివాజీ, విశ్వనాథ్, గణేష్, కొలిపాక శివ పాల్గొన్నారు.

మూడు ముక్కలుగా భద్రాద్రి



భద్రాచలం పట్టణం వ్యూ

రెండు పంచాయతీలుగా సారపాక

- జీపీలను విభజిస్తూ ప్రభుత్వం తీర్మానం.. ఆమోదించిన అసెంబ్లీ
- శాసనసభలో వెల్లడించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి



సారపాక వ్యూ

భద్రాచలంఅర్బన్/బూర్గంపాడు : భద్రాచలం పట్టణాన్ని మూడు పంచాయతీలుగా, సారపాకను రెండుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. ఈ మేరకు పంచాయితీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం శాసన సభలో బిల్లు ప్రవేశపెట్టగా, శనివారం ఆమోదించారు. భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ కొద్ది నెలల క్రితం ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, బీఆర్‌ఎస్ మినహా మిగిలిన అన్ని పార్టీలు వివిధ రూపాల్లో ఆందోళనలు చేశాయి. ఆ తర్వాత దీనిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో విభజన ప్రక్రియ నిలిచిందని భద్రాద్రి వాసులు ఆశించారు. అయితే మంత్రి ఎర్రబెల్లి.. మూడు పంచాయతీలుగా విభజిస్తున్నట్లు తీర్మానం ప్రవేశపెట్టారు. కేంద్ర ప్రభుత్వ చట్టాలను అధిగవింంచలేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. భద్రాచలాన్ని మున్సిపాలిటీగా మార్చేందుకు కూడా కేంద్ర చట్టాలే అడ్డంకిగా మారాయన్నారు. దీంతో మున్సిపాలిటీగా మార్చలేక, మేజర్ పంచాయతీగా ఉంచలేక మూడుగా విభజించాల్సి వచ్చిందని వివరించారు. ఈ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలపడంతో భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ పంచాయతీలుగా ఏర్పాటు చేయనున్నారు. ఇక సారపాకను సారపాక, ఐటీసీ గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ శాసనసభ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారికి ఒకవైపున ఉన్న ప్రాంతాన్ని సారపాక గ్రామపంచాయతీగా, మరోవైపున ఉన్న ప్రాంతాన్ని ఐటీసీ పంచాయతీగా విభజించారు. పారిశ్రామికంగా దినదినాభివృద్ధి చెందుతున్న సారపాకను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. అయితే 2018లో రాష్ట్ర ప్రభుత్వం తండాలు, గూడేలను పంచాయతీలుగా ఏర్పాటు చేసినప్పుడే సారపాకలోని రెండు ప్రాంతాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. కోయగూడెం, తాళ్లగొమ్మూరులను కొత్త పంచాయతీలుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. ఆ తరువాత సారపాక మేజర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసినా.. ఏజెన్సీ చట్టాల కారణంగా ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు.

కోర్టు ఆదేశాలతో భద్రాద్రిపై కదలిక..

భద్రాచలం గ్రామ పంచాయతీనా, మున్సిపాలిటీనా తేల్చి ఎన్నికలు నిర్వహించాలని స్థానిక ఆదివాసీ నాయకుడు సోందె వీరయ్య గతంలో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ సమస్యను తేల్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అల్టిమేటం జారీ చేయగా, అప్పటి నుంచి కోర్టులో ఇరు వర్గాల వాదనలు నడుస్తున్నాయి. భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజిస్తూ గత డిసెంబర్‌లో ప్రభుత్వం జీవో నం. 45 విడుదల చేసింది. దాదాపు 70 వేలకు పైగా జనాభా ఉన్న భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీలో పాలకవర్గం ఎన్నికలు జరగక నాలుగేళ్లు దాటిపోయింది. 2013 జూలైలో పంచాయతీ ఎన్నికలు జరగగా ఆగస్టు మొదటి వారంలో పాలకవర్గం కొలువుదీరింది. దాని గడువు 2018 ఆగస్టులో ముగిసింది. అనంతరం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగినా భద్రాచలం, సారపాకలో మాత్రం నిర్వహించలేదు. ఈ రెండు పంచాయతీలు ఇప్పటి వరకు అధికారుల పాలనలోనే నడుస్తున్నాయి.

పంచాయతీలు ఇలా..

భద్రాచలం : భద్రాచలంలోని సర్వే నం.1 నుంచి 51, 121 నుంచి 128 వరకు గల ప్రాంతంలో కొంత, 132లో కొంత, దేవస్థానం ఉన్న ప్రాంతం (21 వార్డులు)

సీతారాంనగర్ : సర్వే నం.52 నుంచి 90 వరకు (17 వార్డులు)

శాంతినగర్ : సర్వే నం.91 నుంచి 120, 121, 127, 128, 131, 132లో కొంత, 133తో పాటు 207 నంబర్‌లో కొంత భాగం. (17 వార్డులు)

సారపాక : పాతసారపాక, ప్రస్తుత గ్రామపంచాయతీ కార్యాలయం ఏరియా, బసప్ప క్యాంపు, పుల్లయ్య క్యాంపు, ఒడియా క్యాంపు, గాంధీనగర్, రాజీవ్‌నగర్, విజయ్‌నగర్, భాస్కర్‌నగర్, చంద్ర పుల్లారెడ్డినగర్ (17 వార్డులు)

ఐటీసీ : ఐటీసీ పీఎస్‌పీడీ ఏరియా, శ్రీరాంపురం, సినిమాహాల్ ఏరియా, కండక్టర్స్ కాలనీ, మేడే కాలనీ, ప్రగతిస్కూల్ ఏరియా, ముత్యాలమ్మపేట, సుందరయ్యనగర్, మసీద్‌రోడ్ (15 వార్డులు)

మరోసారి సమీక్షించాలి

భద్రాచలాన్ని మూడు పంచాయతీలుగా విభజించడమంటే పుణ్యక్షేత్ర ప్రాముఖ్యతను ధ్వంసం చేయడమే. రాముడు నడయాడిన ఈ ప్రాంత విశిష్టతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలి. భద్రాచలాన్ని మున్సిపాలిటీగా, లేదంటే మేజర్ గ్రామ పంచాయతీగా కొనసాగించాలి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలి.

– పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే

క్లుప్తంగా

నేడు, రేపు హెల్త్ డైరెక్టర్ పర్యటన

కొత్తగూడెంరూరల్: జిల్లాలో ఈ నెల 12,13వ తేదీల్లో రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, జీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు పర్యటించనున్నట్లు డాక్టర్ జీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో 3,500 మంది పాల్గొనగా, 160 మంది విజేతలను ఎంపిక చేశామని, వీరిలో మొదటి 10 మందికి బంగారు నాణేలు, ఆ తర్వాత 150 మందికి వెండి నాణేలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

ఘంటసాలకు నివాళి


గాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

భద్రాచలంఅర్బన్: భద్రాద్రి స్వర సంగమం ఆధ్వర్యంలో గాన గాంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు నివాళులర్పించారు. పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో శనివారం ఆయన వర్ధంతి నిర్వహించారు. తొలుత ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఘంటసాల పాడిన పాటలు అజరామరం అని పేర్కొన్నారు. అనంతరం ఘంటసాల సినీ, సంగీత విభావరి నిర్వహించగా, గాయకులు గీతాలపనతో అలరించారు. ఆ తర్వాత గాయకులను సన్మానించారు. భద్రాద్రి స్వర సంగమం నిర్వాహకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడులు

బూర్గంపాడు: గుండుబా స్థావరాలపై శనివారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు నిర్వహించింది. నాగినేనిప్రోలు, సారపాక, గాంధీనగర్‌లలో దాడులను నిర్వహించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక ద్విచక్ర వాహనాన్ని, 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ సీఐ(టాస్క్‌ఫోర్స్) ఆర్.రాజిరెడ్డి, ఎస్‌ఐ కే గౌతమ్, హెడ్ కానిస్టేబుల్ ఎల్ఆర్‌కే గౌడ్, వెంకటనారాయణ, సుమంత్, రాము పాల్గొన్నారు.

స్కూల్ బస్సు, లారీ ఢీ


ఘటనాస్థలంలో ఢీకొన్న బస్సు, లారీ

పాల్వంచ: స్కూల్ బస్సు, లారీ ఢీకొన్న సంఘటన శనివారం పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శనివారం ఓ ప్రైవేటు స్కూల్ బస్సు విద్యార్థులను పాఠశాలలో దింపి తిరిగి వస్తున్న క్రమంలో నవభారత్ సమీపంలో ప్రధాన రహదారిపై కొత్తగూడెం వైపు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. దీంతో లారీ, బస్సు ముందు ఉన్న అద్దాలు పగిలాయి. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. పాఠశాల బస్సులో కూడా ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

పట్టపగలే చోరీ

రూ.1.50లక్షల నగదు మాయం

పాల్వంచరూరల్: పట్టపగలే చోరీ జరిగిన ఘటనపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బసవతారకకాలనీలో ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న బానోతు బన్సీలాల్ శుక్రవారం ఎప్పటిలాగే ఆటో కిరాయికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి భార్య కూలి పనులకు వెళ్లింది. తిరిగి సాయంత్రం వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టిఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న రూ.1.50 లక్షల నగదు అపహరించారు. తన బావమరిది శేఖర్ ఇటీవల బ్యాంక్ లోను తీసుకుని రూ.1.50 లక్షలు ఇవ్వడంతో ఆ నగదు బీరువాలో పెట్టగా చోరీ జరిగిందని బన్సీలాల్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్‌టీమ్, జాగిలాలతో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఆలయంలో చోరీపై కేసు నమోదు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో సౌండ్ సిస్టానికి సంబంధించిన సామగ్రి మాయమైన సంఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెద్దమ్మతల్లి ఆలయంలో హరికథ చెప్పేందుకు వినియోగించే సౌండ్‌సిస్టం సామగ్రి ఈ నెల 8వ తేదీ రాత్రి మాయమైంది. శనివారం ఆలయ జూనియర్ అసిస్టెంట్ శరత్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

నిలిచిన సీటీ స్కాన్ సేవలు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని సీటీ స్కాన్ మిషన్‌లో శనివారం సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో సేవలు నిలిచిపోగా, టెక్నీషియన్ అధికారులకు తెలియజేయటంతో హైదరాబాద్ నుంచి సాంకేతిక నిపుణులను పిలిపించారు. ఈ మేరకు పరీక్షించిన నిపుణులు సాఫ్ట్‌వేర్ సమస్య ఉన్నట్లు గుర్తించి సరిదిద్దారు. దీంతో సాయంత్రం నుంచి యథావిధిగా సేవలు కొనసాగించినట్లు ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ అమర్‌సింగ్ తెలిపారు.

సం'పత్తి' పతనం..


ఇంట్లో నిల్వచేసిన పత్తి

- రోజురోజుకూ పడిపోతున్న పత్తి ధర
- ప్రతికూల పరిస్థితులతో తగ్గిన దిగుబడి
- గిట్టుబాటులేక దూది రైతుల దిగులు..

బూర్గంపాడు: ఈ ఏడాది పత్తి రైతుల ఆశలు అడియాసలవుతున్నాయి. తొలుత గిట్టుబాటు ధర పలికినా ఆ తర్వాత రోజురోజుకూ ధర పడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరుగుతుందని నెలల తరబడి నిల్వచేసుకున్న కర్షకులు ఇప్పుడు తక్కువ రేటుకే విక్రయిస్తున్నారు. ఇంకా కొందరు ధర పెరగకపోతుందా అని ఎదురు చూస్తున్నారు.

1.85 లక్షల ఎకరాల్లో సాగు..

ఈ ఏడాది జిల్లాలో సుమారు 1.85 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. జూలై, ఆగస్ట్ నెలల్లో వచ్చిన భారీ వర్షాలు, గోదావరి వరదలకు చాలాచోట్ల పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. వరదలు తగ్గిన తరువాత కూడా రైతులు తిరిగి పత్తినే సాగు చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు, చీడపీడలతో పత్తి దిగుబడులు తగ్గాయి. ఎకరాకు సగటున ఏడెనిమిది క్వింటాళ్ల దిగుబడులు మాత్రమే వచ్చాయి. అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చిన తొలివిడత పత్తికి క్వింటాకు రూ.8 వేల నుంచి రూ.9 వేల వరకు ధర పలికింది. దీంతో రైతులు దిగుబడులు తగ్గిన ధర ఉంటుందనే నమ్మకంతో ఉన్నారు. డిసెంబర్ నెలలో పత్తి ధర రూ.7 వేలకు పడిపోయింది. సంక్రాంతి తర్వాత అయినా ధర పెరుగుతుందేమోనని ఆశతో పత్తి విక్రయించకుండా ఇళ్లలోనే నిల్వ ఉంచారు. పండుగ తర్వాత మళ్లీ ధర రూ. 8వేలకు చేరువైంది. రైతులు ఆనందపడేలోపు రెండు, మూడు రోజుల్లోనే పత్తిగింజల ధరలు తగ్గాయంటూ జిన్నింగ్ మిల్లర్లు రేటు రూ.7,500కు దిగువకు తీసుకొచ్చారు. నెలరోజులుగా రూ.7వేల నుంచి రూ.7,300 వరకు మాత్రమే పలుకుతోంది. కనీసం క్వింటాకు రూ.9 వేల ధర వస్తుందని ఆశించిన రైతులకు తీవ్ర నిరాశే మిగిలింది. మూడునెలల క్రితం తీసిన పత్తి కావడంతో బరువు కూడా తగ్గింది. దీంతో రైతులు క్వింటాల్‌కు రూ. 2 వేల చొప్పున నష్టపోయారు. కూలీలు, పురుగుల మందులు, ఎరువులకు తెచ్చిన అప్పులు చెల్లించాల్సిఉండటంతో తక్కువ ధరకే అమ్ముకోక తప్పడంలేదు.

ఎకరానికి పెట్టుబడి రూ.70 వేలు.. ఆదాయం రూ.60 వేలు..

ఇతర దేశాల నుంచి పత్తిని దిగుమతి చేసుకుంటున్నందునే దేశంలోని పత్తికి ధరలు తగ్గుతున్నాయనే ప్రచారం రైతుల్లో సాగుతోంది. ఎకరా పత్తి సాగుకు రూ.70 నుంచి రూ.80 వేల వరకు ఖర్చవుతుండగా, ఆదాయం మాత్రం రూ.60వేలకు మించి రావడం లేదని రైతులు వాపోతున్నారు. పత్తి మద్దతు ధరను క్వింటాకు రూ.10వేలుగా నిర్ణయించాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు. సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. విదేశాల నుంచి పత్తి దిగుమతులను పూర్తిగా నియంత్రించి దేశీయంగా రైతుల వద్ద నున్న పత్తిని గిట్టుబాటు ధరలకు కొనుగోలు పేర్కొంటున్నారు.

కౌలు రైతు పరిస్థితి దయనీయం..

పత్తి సాగు చేసిన కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పట్టా భూముల్లో పత్తిసాగు చేసుకున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా ఎకరాకు రూ.10 వేల పెట్టుబడి సాయమందించింది. ధరణి పట్టా లేని, కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందకపోవటంతో వారు అప్పుల్లో కూరుకుపోయారు. ఒక పక్క పత్తి దిగుబడులు రాక, మరో పక్క గిట్టుబాటు లేక కుదేలవుతున్నారు. ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోయామని కౌలు రైతులు పేర్కొంటున్నారు. కౌలు రైతులకు మేలు జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర మరింతగా పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

రూపాయి మిగల్లేదు



ఎనిమిదెకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేశా. ఎకరాకు పది క్వింటాళ్ల పత్తి పండింది. ధర లేకపోవటంతో రూపాయి మిగల్లేదు. రెండు నెలలు ధర కోసం పత్తిని నిల్వ చేశాను. కూలీలకు, పురుగుమందులకు తెచ్చిన అప్పులు కట్టేందుకు క్వింటా రూ.7,200కే అమ్మాను.

– చెంచలపు రాములు, రైతు, నాగినేనిప్రోలు

ఇంకా వేచిచూస్తున్నాం



పత్తికి ధర వస్తుందని రెండు నెలల నుంచి చూస్తున్నాం. తొలుత రూ.9 వేల వరకు పలికింది. ఇప్పుడు రూ.7 వేలకు పడిపోయింది. క్వింటాకు రూ.2 వేలు తగ్గించి అమ్ముకోలేక నిల్వచేశాను. పత్తి బరువు తగ్గిపోతుంది. ధర కూడా తగ్గుతుంది. ఏమీ చేయాలో అర్థం కావట్లే.

–ఇమడాబత్తుని రామకృష్ణ, రైతు, రెడ్డిపాలెం

కేటీపీఎస్‌లో తరచూ ప్రమాదాలు


కేటీపీఎస్ కాంప్లెక్స్

- ముందస్తు ప్రణాళిక లేకపోవడమే కారణం
- పలువురు కార్మికులకు గాయాలు, కొందరి మృత్యువాత

పాల్వంచ: కేటీపీఎస్ పవర్ ప్లాంట్ ప్రమాదాలకు చిరునామాగా మారింది. అధికారులకు ముందు చూపు లేకపోవడం, ప్రణాళికా లోపం, నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పలువురు కార్మికులు మృత్యువాత పడుతున్నారు. మరికొందరు గాయాల పాలవుతున్నారు. విధి నిర్వహణలో ఎప్పుడు ఎలాంటి విపత్తు వస్తుందో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఘటన జరిగాక విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకున్న సందర్భాలు కూడా లేవనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా శనివారం 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7వ దశ కోల్ ప్లాంట్‌లో బ్రేకర్‌లు అమరుస్తున్న క్రమంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఏఈ విజయ్, ఆర్టిజన్ కార్మికులు మల్లికార్జున్, వరదరాజు తీవ్రంగా గాయపడ్డారు. ముఖం, ఛాతి, చేతుల భాగాలపై కాలి గాయాలయ్యాయి.

కొన్ని ప్రమాదాలను పరిశీలిస్తే..

- గతంలో 5,6 దశల కర్మాగారంలో ఎలక్ట్రికల్ ప్లాంట్ ఎంటీసీ కంట్రోల్ బోర్డు వద్ద బ్రేకర్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఏఈ శ్రీధర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి.
- ట్రాన్స్ ఫార్మర్ యార్డ్‌లో బ్రేకర్ పేలడంతో మనోహర్ అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు.
- బాయిలర్ ట్యూబ్ లీకేజీ చేస్తున్న క్రమంలో వేడి బూడిద పడటంతో ఎం.వీరస్వామి, బానోతు వీరు, జి.రంగారెడ్డి కార్మికుల శరీర భాగాలు కాలాయి.
- 5వ దశ 9వ యూనిట్ సింక్రనైజేషన్ చేస్తున్న క్రమంలో హైడ్రోజన్ గ్యాస్ లీక్ కావడంతో త్రుటిలో ప్రాణా పాయం తప్పింది. హైడ్రోజన్ గ్యాస్ గాల్లో మోతాదుకు మించి కలిస్తే బాంబులా పేలే ప్రమాదం ఉంటుంది.
- 5వ దశలో బాయిలర్ మ్యాన్‌వల్ డోర్ ఓపెన్ చేయడంతో ఒక్కసారిగా గాలి ఉధృతి ఛాతి భాగంలో తగలడంతో ఎత్తైన ప్రదేశం నుంచి కింద పడి వలీ అనే కార్మికుడు మృతి చెందాడు.
- మిల్స్ ఏరియాలో వెనుక నుంచి ఎస్కార్ట్ హైడ్రా వాహనం ఢీ కొట్టడంతో ఫోర్‌మెన్ కట్టా మల్లికార్జున్ రావు అక్కడికక్కడే మృతి చెందాడు.

ట్రాక్టర్, బైక్ ఢీ: ఇద్దరు మృతి


సంఘటనా స్థలంలో మృతదేహాలు



బుగ్గ రవి(ఫైల్), సంతోష్(ఫైల్)

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులను మృత్యువు కబళించింది. ద్విచక్ర వాహనంపై పనిమీద బయలుదేరిన వారు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. ఈ సంఘటన కరకగూడెం ఏపీజీవీబీ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కరకగూడెం గ్రామానికి చెందిన బాదే సంతోష్(23) కూలి పనులతోపాటు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చర్ల మండలంలోని శ్రీకత్తిగూడేనికి చెందిన బుగ్గ రవి(35) కరకగూడెం సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరు స్నేహితులు. కాగా శనివారం ఇద్దరు కలిసి సంతోష్ బైక్‌పై మోతె వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని ఏపీజీవీబీ బ్యాంకు దాటగానే ప్రధాన రహదారిపై బైక్‌ను గొల్లగూడెం గ్రామం నుంచి సారపాక వైపు జామాయిల్ లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. మృతుడు బుగ్గ రవికి భార్య రాజ్యలక్ష్మి, కుమార్తె వెణుహ్యా ఉన్నారు. కాగా సంతోష్ అవివాహితుడు. మృతబంధువుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టానికి మణుగూరు ఆస్పత్రికి తరలిస్తున్నట్లు ఈ.బయ్యారం సీఐ రాజగోపాల్ తెలిపారు.

ఇద్దరివి పేద కుటుంబాలే..

మండల కేంద్రానికి చెందిన బాదే సంతోష్ రోజువారీగా కూలి పనులతోపాటు ట్రాక్టర్ డ్రైవింగ్‌కు వెళ్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. తను ఎంతో ఇష్టంగా ట్రాక్టర్ డ్రైవింగ్‌కి వెళ్లే కుమారుడు.. చివరికి ట్రాక్టర్ ఢీకొనే మృతిచెందడంటూ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కుమారుడి మృతదేహం వద్ద తల్లి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. బుగ్గ రవి 2009 నుంచి సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. పలు చోట్ల పనిచేసి బదిలీల్లో భాగంగా 18 నెలల క్రితం కరకగూడెం సబ్‌స్టేషన్‌కు వచ్చాడు. అందరితో కలుపుగోలుగా ఉంటూ ఆప్యాయంగా పలకరించేవాడని తోటి ఉద్యోగులు పేర్కొంటున్నారు. రవి మృతితో వారి కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయినట్లయింది. స్నేహంగా ఉండే సంతోష్, రవి ఒకే ప్రమాదంతో మృత్యువాత పడటం విచారకరమని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

9 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు యువకుల అరెస్ట్

జూలూరుపాడు: రెండు ద్విచక్రవాహనాలపై గంజాయి తరలిస్తున్న నలుగురు యువకులను శనివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... జూలూరుపాడు ఠాణా సమీపంలోని నాయక్ రైస్ మిల్లు వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కొత్తగూడెం వైపు నుంచి జూలూరుపాడు వైపు రెండు బైక్‌లపై వస్తున్న నలుగురు యువకులు పోలీసులను గమనించి వెనుదిరిగారు. పారిపోతుండగా వెంబడించిన పోలీసులు సాయిరాంతండా–దండుమిట్టతండా గ్రామాల మధ్య పట్టుకున్నారు. తనిఖీ చేయగా వారి వద్ద 9 కేజీల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురిని అరెస్ట్ చేసి విచారించారు.

నిందితులది సూర్యాపేట జిల్లా..

పట్టుబడ్డ నలుగురు నిందితులదీ సూర్యాపేట జిల్లా అని విచారణలో తేలింది. పెన్‌పహాడ్‌కు చెందిన రైల్వే ఉద్యోగి షేక్ సుభాని పాషా, కోదాడ నాయనగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగి ముదియాల వీర సాయి రెడ్డి, డిగ్రీ చదువుతున్న, కోదాడ చిలుకూరుకు చెందిన కొండా వేణు, హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చేస్తున్న, కోదాడ భవానినగర్‌కు చెందిన బొజ్జ అఖిల్ కుమార్ గంజాయి తాగాడానికి అలవాటు పడ్డారు. బయట కొనుగోలు చేస్తే అధిక ధర అవుతుందని భావించి ద్విచక్రవాహనాలపై కోదాడ నుంచి ఒడిశా రాష్ట్రం వైపు వెళ్లారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద 9 కేజీల గంజాయి కొనుగోలు చేసి, తీసుకుని తిరిగి వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడిన 9 కేజీల గంజాయి విలువ రూ. 1.35 లక్షలు ఉంటుందని, గంజాయితోపాటు మూడు సెల్ ఫోన్లు, రెండు బైక్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య తెలిపారు.

చిన్నారి కిడ్నాప్‌నకు యత్నం..?

ములకలపల్లి : రెండేళ్ల చిన్నారి కిడ్నాప్ ఉదంతం కలకలం రేపింది. గుంటూరు జిల్లాకు చెందిన సుభాన్, మున్నీ దంపతులు మండల పరిధిలోని జగన్నాథపురంలో అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. సుభాన్ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఇద్దరు ఆడపిల్ల లు, కాగా పెద్దమ్మాయి బంధువుల వద్ద ఉంటూ విద్యనభ్యసిస్తోంది. చిన్నకూతురు ముషీద తల్లితో ఇంటివద్దనే ఉంటోంది. ఈక్రమంలో ముషీద శనివారం ఇంటిముంగిట ఆడుకుంటుండగా, తల్లి ఇంట్లో వంట పనుల్లో నిమగ్నమైఉంది. ఇంటిముందు గేటు శబ్దం రావడంతో మున్నీ ఇంటి ముందుకు వచ్చింది. అప్పటికే ఓ మహిళ గేటుపై నుంచి చిన్నారి ఎత్తుకొంటుండగా, మున్నీ వెళ్లి పాపను తీసుకున్నది. ఇంట్లోకి వెళ్లి భర్త సుభాన్‌కు ఫోన్లో సమాచారం ఇచ్చింది. ఆ లోగానే వీధి చివరలో నిలిపి ఉంచిన బైక్‌పై ఉన్న మరోవ్యక్తితో కలిసి సదరు మహిళ ఉడాయించింది. సోషల్ మీడియాలో ఈ ఉదంతం వైరల్ కావడంతో ఏఎస్‌ఐ తిరుమలరావు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. బాధిత కుటుంబం నుంచి వివరాలు సేకరించారు.

పీవీకే-5షాఫ్ట్ గనిలో ప్రమాదం

కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే-5షాఫ్ట్ గనిలో శనివారం ప్రమాదం జరిగి ప్రైవేటు కంపెనీ కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలయ్యాయి. సీఎమ్మార్ నడిచే డిస్ట్రిక్ట్‌లో సెకండ్ షిఫ్ట్‌లో 33 రేసు 125 లెవల్ వద్ద కంటిన్యూస్ మైనర్ (సీఎమ్మార్) వద్ద కేబుల్ లాగుతుండగా పై నుంచి బొగ్గుపెళ్ల పడింది. దీంతో గెయిన్‌వెల్ కంపెనీ కార్మికుడు రవి నడుముకు గాయాలయ్యాయి. దీంతో తోటి కార్మికులు సింగరేణి ఆస్పత్రికి తరలించగా, వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. కాగా కాంట్రాక్ కార్మికుడితో బొగ్గు ఉత్పత్తి స్థలంలో పనిచేయించొద్దనే నిబంధనలు ఉన్నా యాజమాన్యం పాటించడం లేదని పలువురు కార్మికులు పేర్కొంటున్నారు.

వివాహ వేళ విషాదం

- అన్న కుమారుడి వివాహానికి వెళ్లొస్తుండగా ప్రమాదం
- కారు చెట్టును ఢీకొనడంతో ఉపాధ్యాయుడు మృతి
- సీటు బెల్ట్ పెట్టుకోకపోవడంతో తెరుచుకోని ఎయిర్‌బ్యాగ్
- స్వల్ప గాయాలతో బయటపడిన మరో నలుగురు


వెంకట శ్రీనివాసరావు (ఫైల్)

దమ్మపేట/సత్తుపల్లి: అన్న కుమారుడి వివాహం దైవసన్నిధిలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.. తెల్లవారితే స్వగ్రామంలో రిసెప్షన్ ఉండడంతో ఏర్పాట్లు చేసేందుకు గాను అర్ధరాత్రి అవుతున్నా సరే కారులో బయలుదేరారు. కానీ గమ్యం చేరుకుండానే వారి ప్రయాణం ముగిసింది. అర్ధరాత్రి ఓ పక్క మంచుతెరలు, మరోపక్క అలసిపోయిన శరీరం వెరసి ఎదురుగా వస్తున్న వాహనాల అద్దాలు సరిగ్గా కనిపించక కారు రహదారి పక్కన చెట్టును ఢీకొట్టడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సీటు బెల్ట్ పెట్టుకోని కారణంగా ఎయిర్‌బెలూన్ తెరుచుకోకపోవడంతో ఆయన మృత్యువాత పడగా, కారులో ఉన్న మిగతా నలుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శనివారం తెల్ల వారుజామున భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం అచ్యుతాపురం శివార్లలో ఈ ప్రమాదం జరిగింది.

దైవసన్నిధి నుంచి పయనం

సత్తుపల్లికి చెందిన అత్తులూరి వెంకటశ్రీనివాసరావు(53) దమ్మపేట మండలం చలమప్పగూడెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన అన్న కుమారుడి వివాహం ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల(చిన్న తిరుపతి)లో శుక్రవారం జరిగింది. ఈ వేడుకలో కుటుంబీకులతో కలిసి పాల్గొన్న శ్రీనివాసరావు సందడిగా గడిపాడు. ఆతర్వాత చిన్న తిరుపతిలో వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నాడు. శనివారం సత్తుపల్లిలో రిసెప్షన్ ఉండడంతో ఏర్పాట్లు చూసుకునేందుకు గాను శుక్రవారం అర్ధరాత్రి 1–30గంటల సమయాన ఆయనే కారు నడుపుతూ బయలుదేరాడు. కారులో ఆయన వెంట భార్య, ప్రభుత్వ ఉపాధ్యాయురాలైన మోహినికుమారి, కుమార్తె మౌనిక, అల్లుడు వంశీకృష్ణతో పాటు మరదలు విజయలక్ష్మి కూడా వస్తున్నారు. వివాహం అనంతరం విశ్రాంతి లేకుండానే బయలుదేరడంతో ఆ సమయాన మంచు కురుస్తుండగా, పెళ్లి ఘనంగా జరిగిన తీరుపై మాట్లాడుకుంటూనే రిసెప్షన్ ఏర్పాట్లపై చర్చిస్తూ వస్తున్నారు. ఈ సమయాన ఎదురుగా వస్తున్న వాహనాల లైటింగ్ కనిపించక దమ్మపేట మండలం అచ్యుతాపురం శివారు నర్సరీల సమీపాన శనివారం తెల్లవారుజామున 3–30 గంటలకు కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ సమయంలో డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాసరావు సీట్‌బెల్ట్ పెట్టుకోలేదని తెలుస్తుండగా తీవ్రంగా గాయపడ్డాడు. ఆ పక్కన కూర్చున్న వంశీకృష్ణ సీట్‌బెల్ట్ పెట్టుకోవడంతో ఎయిర్‌బెలూన్ తెరుచుకుని స్వల్పంగా గాయపడగా వెంటనే 108, పోలీసులకు ఫోన్ చేయడంతో వారు చేరుకుని శ్రీనివాసరావును సత్తుపల్లి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనతో అప్పటి వరకు సంతోషంగా గడిపిన కుటుంబంలో విషాదం అలుముకోగా, వివాహానికి వచ్చిన బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు. శ్రీనివాసరావు మృతి చెందడంతో శనివారం రాత్రి జరగాల్సిన వివాహ రిసెప్షన్ రద్దు చేసి అంత్యక్రియలు ఏర్పాట్లు చేయాల్సి వస్తోందని కన్నీరుమున్నీరుగా రోదించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహం వద్ద సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యా సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఈమేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు దమ్మపేట ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.


అచ్యుతాపురం గ్రామ శివారులో అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

శ్రీగిరిలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



శ్రీశైలం టెంపుల్: మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శ్రీగిరి ఆలయంలో ఆగమశాస్త్రానుసారం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న దంపతులు బ్రహ్మోత్సవాలకు నాయకత్వం వహించే చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు జరిపి బ్రహ్మోత్సవ క్రతువుకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. సాయంత్రం ధ్వజారోహణ, భేరిపూజ కార్యక్రమాలు నిర్వహించి ధ్వజాపతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం తరపున స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లు భృంగివాహన సేవలో భక్తులకు దర్శనమిస్తారు.

జ్యోతిర్ముడి భక్తులకు 15 వరకే స్పర్శదర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని శివమాల ధరించి జ్యోతిర్ముడితో వచ్చిన వారికి మాత్రమే ఈ నెల 15 వరకు మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నట్లు దేవస్థాన ఈవో ఎస్.లవన్న తెలిపారు. శనివారం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు భక్తులందరికీ మల్లికార్జున స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

అది టీడీపీ అసత్యాల పుస్తకం

- ఏపీ మాజీ మంత్రి పేర్ని నాని మండిపాటు
- రచన, ప్రచురణకర్త లేని పిరికి పందల పుస్తకం
- వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు కోరిందే సీఎం వైఎస్ జగన్
- మరి ఆరోజు టీడీపీ ఎందుకు దర్యాప్తు చేయలేకపోయింది?
- మీలాంటి నీచులతో రాజకీయాలు దురదృష్టకరం

సాక్షి, అమరావతి: సీఎం జగన్‌పై విడుదల చేసింది టీడీపీ అసత్యాల పుస్తకం అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) మండిపడ్డారు. వయసు మీద పడిన చంద్రబాబు ఒక అజ్ఞాని అని ఆ పుస్తకం నిరూపిస్తోందన్నారు. విషపు రాతలతో ఒక పుస్తకాన్ని అచ్చేసి బయటకు వదిలారని, రాజకీయాల్లోకి ఆడవాళ్లను కూడా లాగి వివాదం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆ పుస్తకంపై టీడీపీ, చంద్రబాబు పేర్లు పెట్టుకోలేని దౌర్భాగ్య స్థితిలో ఉన్నారని విమర్శించారు. చంద్రబాబు ఓ పిరికిపంద అని దుయ్యబట్టారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ రోజు మీరు ఏం చేశారు?

- టీడీపీ విడుదల చేసిన పుస్తకాన్ని ఎవరు ప్రచురించారు? ఎన్ని కాపీలు వేశారు? అన్న కనీస వివరాలు లేవు. పైగా అదేదో అంతర్జాతీయ పార్టీ అయినట్లు ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడితో విడుదల చేయడం మరో తమాషా. నిజంగా దమ్ముంటే ప్రచురణకర్త, ఎక్కడ, ఎన్ని కాపీలు ముద్రించారు వంటి పూర్తి వివరాలు అందులో ఉటంకించాలి కదా చంద్రబాబూ? అంత పిరికిపంద వా?



- ఆ పుస్తకంలో మీరు రాసినవన్నీ అసత్యాలని మీకూ తెలుసు. మీరెన్ని అసత్యాలు రాసినా సీఎం ప్రతిష్టను , నిజాలను ఏమార్చలేరు. అవి తప్పుడు రాతలని, విషపు రాతలని చంద్రబాబే ఒప్పుకుంటున్నాడు.
- వివేకానందరెడ్డి హత్య జరిగినప్పుడు సీఎం ఎవరు? ప్రభుత్వం ఎవరిది? తప్పుడు రాతలతో విషం చిమ్మే బదులు.. వివేకా కుమార్తెను, భార్యను, అల్లుడిని.. ఊళ్లో ఉన్న ఆయన కుటుంబాన్ని ఎందుకు విచారించలేదు? అప్పుడున్నది మీ ప్రభుత్వమే కదా?
- ఎంపీ అవినాష్‌రెడ్డి అనవాళ్లు చెరిపించాడంటే నువ్వు, నీ డీజీపీ, ఏబీ వెంకటేశ్వరరావు, పోలీసులు ఏం చేశారు? ఆ రోజు వివేకానందరెడ్డి కుమార్తె వాంగ్మూలం ఎందుకు తీసుకోలేదు. అప్పుడు నీది చేత కాని ప్రభుత్వమా? లేక తప్పుడు ప్రభుత్వమా?

మరిన్ని వార్తలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్టీఆర్, కోడెలపై పుస్తకం ఎందుకు వేయలేదు?

- ఎన్టీఆర్ మృతిపై భార్య లక్ష్మీపార్వతి, ఆయన కుమారుడు హరికృష్ణ సీబీఐ దర్యాప్తు కోరితే సీఎంగా ఉన్న నువ్వు కనీసం సీబీసీఐడీ దర్యాప్తు అయినా చేయించావా? మరి అప్పుడిలా పుస్తకం ఎందుకు వేయించలేదు? ఎన్టీఆర్ పతనం, కుట్ర, కుతంత్రం, వెన్నుపోటు, వీటన్నింటిపై పుస్తకం వేయాలి. సీబీఐ దర్యాప్తు జరగాలి.
- అవినాష్ రెడ్డి సీబీఐకి ఇచ్చారని నువ్వు చెబుతున్న వాంగ్మూలం నీకు ఎక్కడి నుంచి వచ్చింది? అంటే సీబీఐ బాబు ఆదేశానుసారం నడుస్తోందని భావించాలా.. ఆ స్టేట్‌మెంట్ నువ్వు అచ్చేయగలిగావంటే నీ మార్గనిర్దేశకత్వంలో సీబీఐ నడుస్తోందనుకోవాలి.
- నీ పార్టీ సీనియర్ నేత కోడెల శివప్రసాదరావు బలవన్మరణంపై పుస్తకం ఎందుకు వేయలేదు? ఆ మరణం వెనుక నీ ప్రమేయం లేకపోతే కోడెల ఫోన్‌ను తెలంగాణ పోలీసులకు ఎందుకివ్వలేదు? ఆ ఫోన్‌ను ఎందుకు ధ్వంసం చేయించావు? నీ పాపాలు బయటకు వస్తాయనే కదా! ఎన్టీఆర్ కుమార్తె మరణంపైనా సీబీఐ దర్యాప్తు వేయాలి కదా?

నీ సంస్కారం ఇదేనా?

- నీ ఇంట్లో వారే ఆడవాళ్లా. ఇతర కుటుంబాల్లోని ఆడవాళ్లకు ఆత్మాభిమానం, పరువు ప్రతిష్టలు ఉండవా? వైఎస్ భారతమ్మ ఫొటో పుస్తకంలో ప్రచురిస్తావా? ఏం నీచపు బుద్ధి నీది? 23 మంది ఎమ్మెల్యేలను కొన్నా, జగన్‌మోహన్‌రెడ్డిని మానసికంగా కుంగదీయలేకపోయావు. నీ వల్ల కాక బీజేపీ నాయకులు, నువ్వు దత్తత తీసుకున్న వారితో అవాకులు చవాకులు మాట్లాడిస్తున్నావు.
- ఎక్కడో యూట్యూబ్‌లో నీ భార్యను ఎవరో ఏదో అన్నారంటూ.. ఒకటే ఏడ్పులు. ఇంత వయసొచ్చిన నీ సంస్కారం ఇదేనా? ఇంత నీచ, కిరాతక, హేయమైన రాజకీయ నాయకుడితో పోటీగా రాజకీయాలు చేయాల్సి రావడం మా దురదృష్టకరం. తెలుగుకు తెగులు పట్టిస్తున్న చదువు సంధ్యలు లేని నీ కొడుకు లోకేశ్‌ను ఊరి మీదికి వదిలి కామెడీ చేయిస్తున్నావు.

విద్యాలయాలుగా ఆర్బీకేలు



కాకినాడ జిల్లా జి.రాగంపేట ఆర్బీకే వద్ద వర్మీకంపోస్ట్ తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా కూడా మారిన ఈ కేంద్రాలు

సాక్షి, అమరావతి: ఏపీలో అన్నదాతలకు విత్తు నుంచి విక్రయం వరకు గ్రామస్థాయిలో సేవలందిస్తున్న వైఎస్సార్ రైతుభరోసా కేంద్రాలు (ఆర్బీకే) యూనివర్సిటీల్లో పాఠ్యాంశమయ్యాయి. వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, వెటర్నరీ, కళాశాల విద్యార్థులకు ప్రాక్టికల్ తరగతులుగా కూడా మారాయి. యూనివర్సిటీలు, అనుబంధ, ప్రైవేటు కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులు ఇక నుంచి విధిగా ఆర్బీకేల్లో ఇంటర్న్‌షిప్ నిర్వహించేలా మార్పుచేశారు. ఇప్పటికే వ్యవసాయ, ఉద్యాన, వెటర్నరీ విద్యార్థులు ఇందుకు శ్రీకారం చుట్టగా, మత్స్య యూనివర్సిటీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన ఈ ఆర్బీకేలు రెండున్నరేళ్లుగా రైతులకు విశేష సేవలందిస్తూ అంతర్జాతీయ మన్ననలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో సచివాలయాలకు అనుబంధంగా మొత్తం 10,778 ఆర్బీకేలను ఏర్పాటుచేశారు. వన్‌స్టాప్ సెంటర్‌గా వీటిని తీర్చిదిద్దారు. బుక్ చేసుకున్న 24 గంటల్లోనే సబ్సిడీ, నాన్ సబ్సిడీ విత్తనాలు, పురుగుల మందులతోపాటు ఎరువులను రైతు ముంగిటకు సరఫరా చేస్తున్నారు.

విశాఖ ఉక్కులో భారీ పేలుడు

9 మందికి తీవ్ర గాయాలు

ఉక్కు నగరం/గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో శనివారం చోటుచేసుకున్న భారీ పేలుడుతో విశాఖ నగరం ఉలిక్కిపడింది. ఈ ప్రమాదంలో 9 మంది తీవ్రంగా గాయపడగా.. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఇనుము ఉత్పత్తిలో భాగంగా స్లాగ్ పాట్ వెళ్లే ట్రాక్‌లో అవాంతరాలు ఏర్పడ్డాయి. వాటిని తొలగిస్తుండగా దాని కిందనున్న నీటిలో వేడిగా ఉన్న స్లాగ్ (ఖనిజం నుంచి లోహాన్ని వేరు చేయగా మిగిలిన ద్రవం) పడింది. దీంతో భారీ పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ మేనేజర్ జె.జయకుమార్ (34), టెక్నీషియన్లు బి.ఈశ్వర్ నాయక్ (36), పండా సాహు (36), డిప్యూటీ జనరల్ మేనేజర్ థాయ్‌వాలా (55), కాంట్రాక్ట్ కార్మికులు ఎస్.పోతయ్య (44), కె.శ్రీను (34), ఆర్.బంగారయ్య (34), ఆర్.సూరిబాబు (36), సీహెచ్.అప్పలరాజు (37) గాయపడ్డారు. శ్రీనుకు 90 శాతం, పోతయ్యకు 65 శాతం, డీజీఎం థాయ్‌వాలాకు 45 శాతం గాయాలైనట్టు వైద్యవర్గాలు తెలిపాయి. ఈ ముగ్గురి పరిస్థితి విషయంగా ఉన్నట్టు అధికారులు వెల్లడించారు. పేలుడు సమాచారం అందుకున్న సీఐఎస్ఎఫ్ ఫైర్ విభాగం సిబ్బంది క్షణాల్లోనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

'మలక్ పేట' బాధ్యులపై చర్యలేవీ?

- ఇద్దరు గర్భిణులు మృతిచెందినా మౌనమే..
- ఇన్ఫెక్షన్, నిర్లక్ష్యంతో మరణించినట్లు నిర్ధారణ
- ప్రభుత్వానికి ఉన్నతాధికారుల నివేదిక

సాక్షి, హైదరాబాద్: మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో ఇద్దరు గర్భిణులకు సిజేరియన్ చేయడం.. వారికి ఇన్ఫెక్షన్ సోకిన అనంతరం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన ఘటనపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎవరిపైనా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైద్య విధాన పరిషత్ కమిషనర్‌డాక్టర్ అజయ్‌కుమార్, గాంధీ సూపరింటెండెంట్‌డాక్టర్‌రాజారావు, పేట్ల బురుజు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌మాలతితో కూడిన త్రిసభ్య కమిటీ దీనిపై వివిధ కోణాల్లో విచారణ చేసి ఇటీవలే సర్కారుకు తుది నివేదిక ఇచ్చింది. ఇన్ఫెక్షన్‌తోపాటు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఇద్దరు గర్భిణీలు మరణించినట్లు నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. ఈ ఘటనకు ప్రధానంగా ముగ్గురు వైద్య సిబ్బందిని బాధ్యులుగా పేర్కొన్నట్లు సమాచారం. అయినా ప్రభుత్వం బాధ్యులపై చర్యలు తీసుకోలేదు.

అసలేం జరిగిందంటే...

జనవరి మొదటి వారంలో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్లండ మండలం చెదుమపల్లికి చెందిన సిరివెన్నెల (23), హైదరాబాద్ పూసలబస్తీకి చెందిన శివాని (24) మలక్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో సిజేరియన్ చేయించుకున్నారు. అనంతరం వారి ఆరోగ్యం విషమించడంతో గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఒకరు జనవరి 12న, మరొకరు 13న మరణించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే చనిపోయినట్లు కుటుంబసభ్యులు ఆరోపించారు. బాలింతల మృతికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లే కారణమన్న వాదనలు కూడా వినిపించాయి. పోస్ట్‌మార్టం రిపోర్టులో కూడా ఇన్ఫెక్షనే కారణమని స్పష్టం చేసినట్లు సమాచారం. ఇందుకు ఆసుపత్రిలో పరిశుభ్రత లోపమే ప్రధాన కారణమని గుర్తించారు. గత ఆగస్టులో ఇబ్రహీంపట్నంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్న నలుగురు మహిళలు మరణించిన తర్వాత వైద్య ఆరోగ్య శాఖ ఆసుపత్రి ఇన్‌ఫెక్షన్ నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసినా ఫలితం లేకపోయిందనడానికి మలక్‌పేట ఘటనను నిదర్శనంగా చెబుతున్నారు.

పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

సాక్షి, హైదరాబాద్: ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం చట్ట సవరణ బిల్లుతో పాటు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్ట సవరణ బిల్లు–2023ని రాష్ట్ర శాసన సభ శనివారం ఏకగ్రీవంగా ఆమోదించింది. పంచాయతీరాజ్ చట్ట సవరణ ద్వారా రాష్ట్రంలో కొత్తగా ఆరు గ్రామ పంచాయతీల ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. భద్రాచలం –కొత్తగూడెం జిల్లా భద్రాచలం మండలంలో కొత్తగా భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలు, బూర్గంపహాడ్ మండలంలో కొత్తగా సారపాక, ఐటీసీ గ్రామ పంచాయతీలు, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ మండలంలో కొత్తగా రాజంపేట గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయనున్నట్టు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సభలో వివరించారు. ఈ రెండు బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించనున్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై వాయిదా తీర్మానం తిరస్కరణ

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్చ కోసం బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులు, నీటి వినియోగంపై చర్చ కోసం సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తిరస్కరించారు.

జిల్లా వార్తలు

పండు ఈగతో తోటలకు నష్టం



రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

మహబూబాబాద్ రూరల్: పండు ఈగ వల్ల పండ్ల తోటలకు నష్టం వాటిల్లుతుందని ఉద్యాన యూనివర్శిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ అధికారి ఏ.కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిధి లోని మల్యాలలో జెన్నారెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్యాన పరిశోధన స్థానంలో షెడ్యూల్డ్ కులాల రైతులకు పండు ఈగ నివారణపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. మల్యాల జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త కె.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్ మాట్లాడారు. పురుగుల మందు రహిత పండు ఈగ నివారణ, ఇతర చీడపీడల నివారణపై రైతులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సూచనలు పాటిస్తూ పండ్ల తోటల సాగు సమయంలో రైతులు తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఫిరమోన్ ట్రాప్స్ ఉపయోగించి పండు ఈగను కూరగాయలు, పండ్ల తోటల్లో నివారించే అంశంపై వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 50 మంది రైతులకు సోలార్ లైట్ ట్రాప్, ఫిరమోంట్రాప్స్ ల్యూర్లు ఉచితంగా అందజేసి వాటి వినియోగంపై ప్రదర్శన ఇచ్చినట్లు వివరించారు. ఈ శిక్షణలో జిల్లా ఉద్యాన అధికారి కె.సూర్యనారాయణ, మల్యాల కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త రాంబాబు, ఏటీజీసీ డైరెక్టర్లు శశిధర్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఉద్యాన శాస్త్రవేత్త ప్రశాంత్‌కుమార్, పి.మహిపాల్‌రెడ్డి, పెస్ట్ కంట్రోల్ సోల్యూషన్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

రండి రండి.. దయ చేయండి!



శుభకార్యాలకు అద్దెకు ఇవ్వనున్న సూపర్ లగ్జరీ బస్సులు

- శుభకార్యాలకు ఆర్టీసీ బస్సు అద్దెలో రాయితీ
- జూన్ 30వ తేదీ వరకు 10శాతం రాయితీ ఆఫర్
- ప్రచారంలో నిమగ్నమైన సంస్థ అధికారులు

సత్తుపల్లి టౌన్: ప్రస్తుతం ఎక్కడ చూసినా పెళ్లిళ్లు జరుగుతున్నాయి. శుభకార్యాల సీజన్ కావడంతో బస్సులను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవడంపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించారు. ఈమేరకు శుభకార్యాలు, పెళ్లిళ్లకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకుంటే 10శాతం రాయితీ కల్పిస్తూ సంస్థ ఎండీ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈఏడాది జూన్ 30వ తేదీ వరకు ఈ రాయితీ అమల్లో ఉంటుందని వెల్లడించారు. అయితే, ఆ తర్వాత రెండు నెలల్లోగా రాయితీ వర్తించాలంటే జూన్ 30లోగా బుకింగ్ చేసుకుంటే అద్దె ప్రతిపాదికన శుభకార్యాలు, పెళ్లిళ్లకు ఆర్టీసీ బస్సులను వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.

దండిగా ముహూర్తాలు

ఫిబ్రవరిలో 12, మార్చిలో 14కు పైగా శుభ ముహూర్తాలు ఉన్నాయని పండితులు చెబుతున్నారు. ఆతర్వాత ఏప్రిల్ నెలలో గురుమూఢంతో శుభకార్యాలకు బ్రేక్ పడుతుంది. ఇక మళ్లీ మే, జూన్ నెలల్లో శుభలగ్నాలు ఉన్నాయి. ఈ సీజన్‌లో వాహనాల కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా చూడడంతో పాటు ఆదాయం సమకూర్చుకోవాలనే ఆలోచనతో ఆర్టీసీ బస్సులను 10శాతం రాయితీతో అద్దెకు ఇచ్చేలా ఆఫర్ ప్రకటించారు. గతేడాది కర్తీకమాసం, వనభోజనాలు, శబరిమల భక్తుల కోసం ప్రవేశపెట్టిన 10శాతం రాయితీ గడువు డిసెంబర్ 31వ తేదీతో ముగిసింది. ఈ సమయంలో సత్తుపల్లి డిపో 48 బస్సులను డిసెంబర్‌లో అద్దెకు ఇచ్చి రూ.11.78 లక్షల ఆదాయాన్ని సాధించింది. దీంతో మళ్లీ రాయితీ ప్రకటించినందున ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

డిపో	మేనేజర్ ఫోన్ నంబర్	ఆర్టీసీ బస్సులు
ఖమ్మం	9959 225958	88
కొత్తగూడెం	9959 225959	37
భద్రాచలం	9959 225960	55
మధిర	9959 225961	29
సత్తుపల్లి	9959 225962	41
మణుగూరు	9959 225963	32

బస్సుల అద్దె ఇలా

ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో 55 సీట్లు ఉండగా.. కిలోమీటర్‌కు రూ.66గా అద్దె నిర్ణయించారు. అలాగే ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లో 55 సీట్లు ఉండగా కిలోమీటర్‌కు రూ.69 చొప్పున, సూపర్ లగ్జరీ బస్సులో 36 సీట్లు ఉండగా కిలోమీటర్‌కు రూ.60, రాజధాని ఏసీ బస్సులో 40 సీట్లు ఉంటే కిలోమీటర్‌కు రూ.79గా అద్దె వసూలు చేయనున్నారు. అయితే, పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కనీసం 200 కి.మీ., సూపర్‌లగ్జరీ బస్సులైతే 300 కి.మీ., రాజధాని బస్సులను కనీసం 400 కి.మీ. ఉంటేనే అద్దెకు ఇస్తారు. కాగా, రీజి యన్‌లోని ఆరు డిపోల్లో ఆర్టీసీ సంస్థ బస్సులకు తోడు అద్దె బస్సులు ఉన్నప్పటికీ, కేవలం సంస్థ బస్సులను మాత్రమే అద్దెకు ఇవ్వాలని నిర్ణయించారు.

ఫిట్‌నెస్ బస్సులు.. సుశిక్షితులైన డ్రైవర్లు

పెళ్లిళ్లు, శుభకార్యాలకు అద్దెకు ఇచ్చే సమయాన ఫిట్‌నెస్ ఉండేవి, అందులోనూ కొత్త బస్సులకే ప్రాధాన్యత ఇస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అలాగే, ఆర్టీసీలో సుశిక్షితులైన డ్రైవర్లు ఉన్నందున ప్రైవేట్ వాహనాల కంటే సురక్షితమని, సమయపాలనే పాటిస్తూ గమ్యస్థానాలకు చేరవేస్తారని ప్రచారం చేస్తున్నారు. అంతేకాక ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే అద్దె కూడా తక్కువే అయినందున ఆర్టీసీని ఆదరించాలని అధికారులు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోండి..



పెళ్లిళ్ల సీజన్‌లో పది శాతం రాయితీపై ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇవ్వనున్నారు. అవసరమైన నేరుగా డిపోల్లో కానీ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సంప్రదించి కానీ బస్సులు బుక్ చేసుకోవచ్చు. సురక్షితమైన ప్రయాణం ఆర్టీసీ బస్సుల్లోనే సాధ్యమవుతుందని ప్రజలు గుర్తించాలి.

– యు.రాజ్యలక్ష్మి, ఆర్టీసీ డీఎం, సత్తుపల్లి

సంక్షేమంతో పాటు శిక్షణపై దృష్టి



మాట్లాడుతున్న అల్లం నారాయణ, పక్కన యూనియన్ బాధ్యులు మారుతిసాగర్ తదితరులు

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
- త్వరలోనే జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

కొత్తగూడెంఅర్బన్: పాత్రికేయుల వృత్తి నైపుణ్యం మెరుగుపడేలా శిక్షణ ఇస్తూనే సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో మీడియా అకాడమీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రత్యేకమైన జర్నలిజం వృత్తిలో ఉన్న వారు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుంటూ ప్రత్యేకత చాటుకోవాలని సూచించారు. ఆధునిక జర్నలిజంపై పాత్రికేయులకు సమగ్ర అవగాహన అవసరమని గుర్తించి గతంలో పాత పది జిల్లాల్లో 8 వేల మందికి శిక్షణ ఇవ్వగా.. ఇప్పుడు కొత్త జిల్లాల వారీగా శిక్షణ తరగతులు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు. వేగం, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాత్రికేయులకు శిక్షణ తప్పనిసరైందని తెలిపారు. అనుభవంతో పాటు వృత్తిలో నైపుణ్యం పెంచుకుంటే నాణ్యమైన, సమాజానికి ఉపయోగపడే వార్తలను అందించొచ్చని వెల్లడించారు. తెలంగాణ పోరాటంలో ఉధృతంగా పాల్గొనడమే కాక చైతన్యాన్ని ప్రదర్శించింది పాత్రికేయులేనని అల్లం గుర్తు చేశారు.

రాష్ట్రప్రభుత్వంనుంచి రూ.100 కోట్లు

రాష్ట్రప్రభుత్వం పాత్రికేయుల సంక్షేమం కోసం రూ.100 కోట్లు కేటాయించగా, రూ.42 కోట్లు విడుదల చేసిందని అల్లం నారాయణ తెలిపారు. మంజూరైన నిధుల నుంచి రాష్ట్రంలో ఇప్పటివరకు 490 మందికి పైగా పాత్రికేయుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం మంజూరుతో పాటు ప్రతినెలా రూ.3 వేల పింఛన్, చదువుకునే పిల్లలకు రూ.వేయి ఉపకార వేతనాలు ఇస్తున్నట్లు చెప్పారు. కరోనా కష్టకాలంలో 5 వేల మంది పాత్రికేయులకు రూ.7 కోట్ల మేర సాయం అందించినట్లు వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఖమ్మం వచ్చిన సందర్భంగా పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రక్రియ ప్రారంభమైందని, త్వరలోనే అన్ని జిల్లాల్లో పాత్రికేయులకు ఇంటిస్థలాలు మంజూరవుతాయని తెలిపారు. అనంతరం 'సోషల్ మీడియా – ధోరణులు' అంశంపై టైమ్స్ ఆఫ్ ఇండియా ఎడిటర్ సుధాకర్‌రెడ్డి, 'గ్రామీణ వార్తలు' అంశంపై సీనియర్ పాత్రికేయులు రమణారావు మాట్లాడారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మారుతిసాగర్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మేనేజర్ వెంకటేశ్, ఓఎస్డీలు రెహమాన్, వనజ, వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, టీయూడబ్ల్యూజే భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు కల్లోజి శ్రీనివాసరావు, ఆదినారాయణతో పాటు యోగానంద్, విష్ణువర్ధన్, వట్టికొండ రవి, సీహెచ్.నర్సింహారావు, చంద్ర నర్సింహారావు, షఫీ, బాలయోగి తదితరులు పాల్గొన్నారు. తొలుత మీడియా అకాడమీ చైర్మన్‌ను డీపీఆర్వో శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు.

కవిత, రెడ్యానాయక్‌పై ఆరోపణలు పాతవే..

కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్



మాట్లాడుతున్న బలరాంనాయక్, నాయకులు

ఇల్లెందు: డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్, మహబూబాబాద్ ఎంపీ కవితపై పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలు కొత్తవేమీ కాదని.. చాన్నాళ్ల నుంచి ఉన్నవేనని కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ స్పష్టం చేశారు. ఇల్లెందులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా డోర్నకల్, మహబూబాబాద్‌లో జరుగుతున్న ప్రచారాన్నే రేవంత్‌రెడ్డి వెల్లడించారు తప్ప కొత్త ఆరోపణలేమీ చేయలేదన్నారు. రెడ్యానాయక్ సర్పంచ్ మొదలు మంత్రి వరకు పదవులు నిర్వర్తించారంటే కాంగ్రెస్ చలువేనని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు మల్లు రవి మాట్లాడుతూ రెడ్యానాయక్ చేసిన ఆరోపణలు ఆర్టీఐ యాక్టును అవమానించేలా ఉన్నాయని పేర్కొన్నారు. రెడ్యానాయక్, ఆయన కూతురు కవిత కేసీఆర్ వద్ద కట్టుబానిసలుగా ఉండడంతోనే ఎస్టీలకు అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించడం లేదని స్పష్టంచేశారు. సమావేశంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, నాయకులు చెరుకు సుధాకర్, చీమల వెంకటేశ్వర్లు, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, గుండెబోయిన నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రెడ్యానాయక్‌కు రాజకీయ జీవితాన్ని ఇచ్చింది కాంగ్రెస్సే..

టీపీసీసీ సభ్యుడు రాంచంద్రునాయక్



మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

మరిపెడ: డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు రాజకీయ జీవితాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయే అని, అలాంటి పార్టీని వీడి ఆస్తులు కాపాడుకోవడానికి బిడ్డ ఎంపీ కవితతో కలిసి ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లారని టీపీసీసీ సభ్యుడు, డోర్నకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జాటోతు రాంచంద్రునాయక్ ఆరోపించారు. మరిపెడలో కాంగ్రెస్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ మాట్లాడుతూ రెడ్యానాయక్‌కు సర్పంచ్‌గా, సమితి ప్రెసిడెంట్‌గా, మండల అధ్యక్షుడిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఓ సారి మంత్రిగా అవకాశం కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు. కానీ అధికారం, అక్రమ సంపాదన కోసమే ఎమ్మెల్యే రెడ్యానాయక్, ఎంపీ కవిత పార్టీ మారారని వివరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన జోడో యాత్రలో ఎమ్మెల్యే, ఎంపీపై చేసిన ఆరోపణలన్నీ వాస్తవాలేనని తెలిపారు. అలా కాదని నిరూపిస్తే ఎక్కడ చర్చించడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పెండ్లి రఘువీర్‌రెడ్డి, అంబటి వీరభద్రం, జినకల రమేష్, గుగులోతు బట్టు నాయక్, బత్తుల శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కర్ణాకర్ రెడ్డి, బండి శ్రీనివాస్, దాసరోజు రాజు, రజినీకాంత్, తాజుద్దీన్, సమీర్ జైన్, గుగులోతు రవి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాతలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిత్యాన్నదానం కోసం విజయవాడకు చెందిన శ్రీద్వారకామయి చారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు సురేశ్‌స్వామి శనివారం రూ.50 వేలు విరాళంగా అందించారు.